ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- గిరిజన గ్రామాలకు రహదారులతో సహా మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు.

- కృత్రిమ మేధో సంపత్తిని అందిపుచ్చుకోవడంలో యువతను అగ్ర స్థానంలో నిలుపుతామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు.

- పర్యాటక రంగంలో 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

- తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

===================

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరులో ఈరోజు పర్యటించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం కోసం ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులలో నాణ్యత లోపించినట్లయితే సంబంధిత అధికారులపైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతుల నుండి నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించిన 48 గంటలలో వారి ఖాతాలలో నగదు మొత్తం జమ చేస్తామని చంద్రబాబునాయుడు పేర్కొంటూ...

ముఖ్యమంత్రి బైట్.. (వాయిస్..27 సెకన్లు)

===================

గిరిజన గ్రామాలకు రహదారులతో సహా మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆయన ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మక్కువ మండలం బాగుజోల గ్రామం నుండి సాలూరు మండలం సిరివర గ్రామం వరకు సుమారు 9.50 కోట్ల రూపాయల వ్యయంతో 9కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, గిరిజన గ్రామాలలో గర్భిణీ స్త్రీలకు, రోగులకు డోలి మోతలు ఉండకూడదనే లక్ష్యంతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లుగా పేర్కొన్నారు. గిరిజనులు అధిక సంఖ్యలో ఒక దగ్గర ఉంటే రహదారులు వేయడం సాధ్యమవుతుందని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

ఉప ముఖ్యమంత్రి (వాయిస్..26 సెకన్లు)

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, వివిధ నియోజకవర్గాల శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

===================

కృత్రిమ మేధో సంపత్తిని అందిపుచ్చుకోవడంలో యువతను అగ్ర స్థానంలో నిలుపుతామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆ దిశగా అనేక ప్రముఖ సంస్థలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంటోందన్నారు. కాగా, రాష్ట్రంలో డీప్-టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలను చేసుకుంది. ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్ తో

కలిసి ఆంధ్రప్రదేశ్ లో AI-ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్, యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ తో ప్రభుత్వం మరో ఒప్పందం కూడా చేసుకుంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఉండవల్లి నివాసంలో నారా లోకేష్ సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి.

===================

అమరావతిలో 2027వ సంవత్సరంలో జాతీయ క్రీడలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయనగరంలో 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ హాల్ ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక శాసన సభ్యురాలు అదితి గజపతిరాజుతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీడాంధ్రప్రదేశ్ గా రూపొందించే లక్ష్యంతో అత్యుత్తమ క్రీడా విధానాన్ని తీసుకువచ్చామని చెప్పారు. రాష్ట్రంలో క్రీడాకారుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా అన్ని ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు, స్టేడియంలు, అకాడమీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రాథమిక స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయి వరకు పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు చేపడతామన్నారు.

===================

విరామం

===================

పర్యాటక రంగంలో 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్టణంలో ఈరోజు పర్యటించిన సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాను ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. దీని ద్వారా పెట్టుబడి దారులను ఆకర్షించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని మంత్రి పేర్కొంటూ...

కందుల దుర్గేష్ .. బైట్..(వాయిస్..26 సెకన్లు)

===================

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ప్రస్తుతం ఇది ఉత్తర దిశగా ప్రయాణిస్తోంది. తీవ్ర అల్పపీడనం వల్ల రానున్న ఇరవై నాలుగు గంటల పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో గంటకు 35-45 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. కాకినాడ, అల్లూరి, అనకాపల్లి, విశాఖ, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. అలాగే, దక్షిణ కోస్తాలోని పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, రైతులు వ్యవసాయ పనుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

===================

భారీ వర్షాల నేపథ్యంలో వరి పంట నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అయితే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసి ముద్దయిన, రంగు మారిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

===================

కర్మాగారాలలో భద్రతా చర్యలతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈ రోజు ఫ్యాక్టరీస్ బాయిలర్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కర్మాగారాలలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్”

కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===================

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ అంటే భారతీయ జనతా పార్టీకి అపారమైన గౌరవమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, అంబేద్కర్ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి పెట్టకుండా గౌరవించిందని తెలిపారు. దేశంలో అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాలలో పంచ తీర్థ కార్యక్రమాన్ని బీజేపీ చేపట్టిందని అన్నారు. అంబేద్కర్ కి భారతరత్న పురస్కారాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి గుర్తు చేశారు. కాగా, దేశానికి జమిలి ఎన్నికలు కొత్త కాదని గతంలో జరిగాయని తెలిపారు.

===================

===================